# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-11-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

**2. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఆధునిక సమాచార, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని రాష్ట్ర శాసన సభాపతి సీహెచ్ అయ్యన్నపాత్రుడు అన్నారు.**

**3. రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నగదును కళాశాలల బ్యాంకు ఖాతాలకు నేరుగా బదిలీ చేసే విధానాన్ని పునరుద్ధరిస్తున్నామని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు.**

**4. విజయవాడలో రేపు ఉద్యోగమేళాను నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ఉపాధి శాఖ అధికారి డి.విక్టర్ బాబు పేర్కొన్నారు.**

**5. భారత రత్న, నోబెల్ పురస్కార గ్రహీత సర్ సి.వి.రామన్ 136వ జయంతిని ఈరోజు జరుపుకుంటున్నాం.**

==========================

రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా రాజధాని గ్రామమైన తాళ్లాయపాలెంలో రాష్ట్రంలోనే మొదటి గ్యాస్ ఇన్సులేటెడ్ ఉపకేంద్రాన్ని ముఖ్యమంత్రి ఈరోజు ప్రారంభించారు. అనంతరం దృశ్యమాధ్యమం ద్వారా 5 విద్యుత్ ఉపకేంద్రాలకు ప్రారంభోత్సవాలు,14 సబ్ స్టేషన్లకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ,

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఆధునిక సమాచార, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని రాష్ట్ర శాసన సభాపతి సీహెచ్ అయ్యన్నపాత్రుడు అన్నారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీలో జరుగుతున్న 67వ కామన్వెల్త్ పార్లమెంటరీ మహాసభల్లో నిన్న 'ఉత్తమ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం-ప్రతిష్ఠ' అంశంపై ఆయన మాట్లాడుతూ, శాసనసభలో త్వరలోనే కాగిత రహిత కార్యకలాపాలకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పారదర్శకతే శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలను భిన్నంగా నిలుపుతోందన్నారు. పారదర్శకతను పెంచేందుకు చట్టసభల సమావేశాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నామని అయ్యన్నపాత్రుడు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నగదును కళాశాలల బ్యాంకు ఖాతాలకు నేరుగా బదిలీ చేసే పాత విధానాన్ని ఈ విద్యాసంవత్సరం నుంచి పునరుద్ధరిస్తున్నామని సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. 3 వేల 500 కోట్ల రూపాయల బకాయిలను దశలవారీగా చెల్లిస్తామన్నారు. ధృవీకరణ పత్రాలు , ఇతర అవసరమైన పత్రాల జారీలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం కళాశాలలతో కలిసి పనిచేస్తుందని చెప్పారు.

---------------------------

క్యాన్సర్ వ్యాధిని తొలి దశలోనే గుర్తిస్తే చికిత్స సులభమవుతుందని ప్రకాశం జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఒంగోలులో ఈ రోజు ఏర్పాటు చేసిన ర్యాలీలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం సురేష్ కుమార్ మాట్లాడుతూ,

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

విజయవాడ వరద ప్రభావిత ప్రాంత ప్రజల వాహనాలు, వివిధ ఆస్తి నష్టాలకు సంబంధించి బీమా చెల్లింపులను 100 శాతం పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఎన్టీఆర్ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ డాక్టర్ నిధిమీనా సంబంధిత అధికారులను ఆదేశించారు. విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో బీమా సంస్థల ప్రతినిధులతో ఇన్చార్జి కలెక్టర్ నిన్న సమావేశాన్ని నిర్వహించి, సంస్థల వారీగా చెల్లింపుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మోటార్ వాహనాలు, ఆస్థి నష్టాలకు సంబంధించి మొత్తం 15 వేల 459 దరఖాస్తులు నమోదయ్యాయని తెలిపారు. వాటిలో ఇప్పటికే బీమా సంస్థలు 98.20 శాతం చెల్లింపులను పరిష్కరించాయని పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యా భివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్డీఏ సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో రేపు ఉద్యోగమేళాను నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ఉపాధి శాఖ అధికారి డి.విక్టర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళా విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉదయం పది గంటల నుంచి జరుగుతుందని పేర్కొన్నారు. పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ పూర్తిచేసి, 20 నుంచి 35 ఏళ్ల లోపువారు అర్హులని వివరించారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు జాబ్ మేళా వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

---------------------------

ఆస్ట్రేలియాలో జరుగుతున్న 67వ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సుకు రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి హాజరయ్యారు. ఈ సదస్సులో చర్చిస్తున్న అంశాల పట్ల సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ పార్లమెంటరీ దేశాల ప్రతినిధులతో కలిసి కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ –సీపీఏ సదస్సులో పాల్గొనడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ సదస్సులో అర్థవంతమైన చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. మహిళా సాధికారికత కోసం ప్రధానమంత్రి

నరేంద్రమోదీ దేశంలో చేపడుతున్న అంశాలను సవివరంగా వివరించడానికి దోహదపడిందన్నారు. రేపటితో ఈ సదస్సు ముగుస్తుంది.

---------------------------

కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్-విల్లుపురం మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు విజయవాడ రైల్వే ప్రజా సంబంధాల అధికారి నుస్రత్ మండ్రుప్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్-విల్లుపురం ప్రత్యేక రైలు ఈ రోజు, ఈనెల 14వ తేదీలో సికింద్రాబాద్‌లో బయలుదేరి విల్లు పురం చేరుకుంటుందని, తిరుగు ప్రయాణంలో రేపు, ఈనెల 15వ తేదీన విల్లుపురంలో బయలుదేరి సికింద్రాబాద్ చేరుకుంటుందన్నారు. రెండు మార్గాల్లో ఈ రైలు మౌలాలీ, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్ పాడి, తిరువణ్ణామలై స్టేషన్లలో ఆగుతుందని తెలిపారు.

---------------------------

భారత రత్న, నోబెల్ పురస్కార గ్రహీత సర్ సి.వి.రామన్ 136వ జయంతిని ఈరోజు జరుపుకుంటున్నాం. 1988 నవంబర్ 7న తిరుచినాపల్లి సమీపంలోని పెటాయ్ అనే గ్రామంలో చంద్రశేఖర్ అయ్యర్, పార్వతి అమ్మాళ్ దంపతులకు ఆయన జన్మించారు. ఆయన భౌతిక శాస్త్రంలో రూపొందించిన రామన్ ఎఫెక్ట్ సిద్ధాంతానికి 1930లో నోబెల్ పురస్కారం లభించింది. 1954 లో భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన భారతరత్న పురస్కారంతో సత్కరించింది. 1970 నవంబర్ 20న ఆయన తుది శ్వాస విడిచారు. రామన్ ఎఫెక్ట్ కనుగొన్న సందర్భాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నారు.

---------------------------

ఎండోక్రైన్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇసికాన్ 53వ జాతీయ సదస్సు విశాఖపట్నంలో ఈరోజు నిర్వహిస్తున్నారు. విశాఖలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. ఈ సదస్సుపై మరింత సమాచారాన్ని మా ఆకాశవాణి విశాఖపట్నం ప్రతినిధి వి. సత్యనారాయణ మూర్తి అందిస్తారు.

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

బ్యాడ్మింటన్ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు పాల్గొనడమే లక్ష్యంగా బ్యాడ్మింటన్ అకాడమీని ఏర్పాటు చేస్తున్నామని ప్రముఖ క్రీడాకారిణి పీవీ సింధు అన్నారు. విశాఖపట్నంలోని పెద గదిలిలో బ్యాడ్మింటన్ అకాడమీ నిర్మాణానికి ఆమె ఈ రోజు భూమిపూజ నిర్వహించారు. అనంతరం పీవీ సింధు మాట్లాడుతూ, బ్యాడ్మింటన్ అకాడమీ పనులు త్వరగా చేపట్టి ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అకాడమీ సామర్థ్యం, శిక్షణ తదితర వివరాలను త్వరలో వెల్లడిస్తామని ఆమె తెలిపారు.

---------------------------

తిరుమల తిరుపతి దేవస్థానం నూతన పాలకమండలి సభ్యులుగా జి.భాను ప్రకాష్ రెడ్డి, ఎ.సుచిత్ర , ముని కోటేశ్వరరావులు ఈరోజు బాధ్యతలను స్వీకరించారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న

అనంతరం రంగ నాయకుల మండపంలో బోర్డు మెంబర్లుగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు పాత్రికేయులతో మాట్లాడుతూ, తిరుమల తిరుపతి దేవస్థానం అభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందిస్తామని చెప్పారు. కాగా ఇప్పటివరకు మొత్తం 18 మంది పాలకమండలి సభ్యులు పదవి బాధ్యతలు చేపట్టగా మరో ఏడుగురు ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంది.

---------------------------

ఈ రోజు శిశు పరిరక్షణా దినోత్సవం నిర్వహిస్తున్నారు. నవజాత శిశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించే అంశంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు ప్రతి ఏటా నవంబర్ 7వ తేదీన శిశు పరిరక్షణా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. శిశువు జన్మించిన తొలి నెల రోజుల కాలాన్ని నవజాత శిశువుల కాలంగా పరిగణిస్తారు. మహిళ గర్భం దాల్చిన తరువాత సరైన రీతిలో పోషకాహారం తీసుకోని పక్షంలో దాని దుష్ప్రభావం తల్లిపై మాత్రమే కాకుండా బిడ్డపై కూడా ఉంటుంది. ఇటువంటి పరిస్థితిని నివారించే ఉద్దేశ్యంతో తల్లి బిడ్డల సంక్షేమాన్ని కాంక్షిస్తూ... గర్భం దాల్చిన మహిళ పోషకాహారం తీసుకోవలసిన అవశ్యకత గురించి ఈరోజు అవగాహన కల్పిస్తున్నారు.

======================